నిరంతరం వెలుగులు..



తారానగర్ రాంరెడ్డి గార్డెన్ రోడ్డులో వెలుగుతున్న స్ట్రీట్‌లైట్లు

శేరిలింగంపల్లి: చందానగర్ డివిజన్ తారానగర్‌లో స్ట్రీట్ లైట్లు నిరంతరం వెలుగుతున్నాయి. రాత్రి, పగలు తేడా విద్యుత్ వినియోగం తగ్గించేందుకు ఎల్ఈడీ లైట్లు ఏర్పాటు చేసినా ఫలితం లేదు. ఇప్పటికైనా జీహెచ్ఎంసీ ఉన్నతాధికారులు జోక్యం చేసుకొని స్ట్రీట్ లైట్ల నిర్వహణపై దృష్టి సారించాలని స్థానికులు కోరుతున్నారు.

ముగిసిన 'ఆచార్య వందన'



మాదాపూర్: శిల్పారామంలో నిర్వహిస్తున్న గురుపూజోత్సవ వేడుకల్లో భాగంగా ఆచార్య వందన కార్యక్రమం ఆదివారంతో ముగిసింది. పద్మభూషణ్ దివంగత డాక్టర్ వెంపటి చిన సత్యం ప్రథమ పుత్రిక నాట్యగురువు కామేశ్వరి శిష్యబృందం పాల్గొన్నారు. జతిస్వరం, రామాయణశబ్దం, భావయామి, ఎటువంటివాడే, తారంగం, పదవర్ణం, మోహనకళ్యాణి, తిల్లాన అంశాలను కళాకారులు కళ్యాణి, అక్షిత, కీర్తన, శ్రియ, సౌమ్య, అనన్య, జస్మిత ప్రదర్శించారు.

నష్టపరిహారం చెల్లించాలి



కల్తీ కల్లు బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించిన సీపీఎం నాయకులు

కూకట్‌పల్లి: కూకట్‌పల్లి పరిధి సాయిచరణ్‌కాలనీ, ఆదర్శనగర్, ఇంద్రహిల్స్, అడ్డగుట్ట తదితర బస్తీల్లో కల్తీ కల్లు తాగి అనారోగ్యానికి గురైన సుమారు 30 మంది వరకు ఉన్నారని, మృతుల కుటుంబ సభ్యులను ఆదివారం సీపీఎం కూకట్‌పల్లి మండల కమిటీ ఆధ్వర్యంలో పరామర్శించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ బాధితులను కల్లు దుకాణాల యాజమాన్యాలు, ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేశారు. మరణించిన వారి కుటుంబాలకు నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఎం కార్యదర్శి ఎం. శంకర్, సాయిరెడ్డి, లక్ష్మీపతిరావు, బసవరాజ్, లక్ష్మమ్మ, మంగమ్మ, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

నూతన కల్వర్టు ప్రారంభం



కల్వర్టును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి

పటాన్‌చెరు: తెల్లాపూర్ మున్సిపల్ పరిధిలోని పాటి గ్రామ పరిధిలో గల మరనాత హీలింగ్ టెంపుల్ చర్చి సమీపంలో రూ. 50 లక్షల అంచనా వ్యయంతో నిర్మించిన కొత్త కల్వర్టును ఆదివారం ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి ప్రారంభించారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు రామచంద్రారెడ్డి, భాస్కరరావు పాల్గొన్నారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యం



మియాపూర్: గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైన సంఘటన మియాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..మియాపూర్ మెట్రోస్టేషన్ సమీపంలో జాతీయ రహదారి పక్కన ఓ వ్యక్తి అపస్మారకస్థితిలో పడి ఉన్నాడని ఆదివారం ఉదయం మియాపూర్ పోలీసులకు మెట్రో సిబ్బంది సమాచారం అందించారు. వెంటనే పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించగా ఆ వ్యక్తి మృతి చెంది ఉన్నాడు. చుట్టుపక్కల విచారించగా సమాచారం లభించలేదు. అనారోగ్య కారణాలతో మృతి చెంది ఉంటాడని పోలీసులు ప్రాథమిక అంచనాలో తేలింది. మృతదేహాన్ని గాంధీ ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.



మాదాపూర్ చందానాయక్‌తండాలో అస్తవ్యస్తంగా ఉన్న రోడ్లు



గుంత.. మరమ్మతులకు అంతకంత..

- తరచు వాహనదారులకు తప్పని రిపేరు ఖర్చులు
- మాదాపూర్ పరిసరాల్లో రోడ్లన్నీ గుంతలమయం

మాదాపూర్: అంతర్జాతీయ సదస్సులకు నిలయంగా మారిన మాదాపూర్ పరిసర ప్రాంతాల రోడ్లు అస్తవ్యస్తంగా తయారయ్యాయి. ఐటీ ప్రాంతం కావడంతో నిత్యం వేల సంఖ్యలో వాహనాలు తిరుగుతుంటాయి. రోడ్లు అధ్వానంగా మారడంతో వాహనదారులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులుపడుతున్నారు. ఇంటికి చేరుకునేందుకు గంటల సమయం పడుతుందని ఐటీ ఉద్యోగులు, విద్యార్థులు వాపోతున్నారు. మాదాపూర్‌లోని చందానాయక్‌తండా, సాయినగర్ సర్వే ఆఫ్ ఇండియా తదితర ప్రాంతాలలో రోడ్లు నడవడానికి కూడా వీలు లేకుండా ఉన్నాయి. కొద్దిపాటి వర్షం పడిందంటే రోడ్లపై నీరు నిలవడంతో ఎక్కడ గుంతలు ఉన్నాయో తెలియక ప్రమాదాలకు గురవుతున్నారు. ప్రధాన రహదారులు కావడంతో గుంతల కారణంగా ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతున్నాయి. దీంతో వాహనాల మరమ్మతులకు తడిసి మోపెడవుతుందని వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రోడ్ల మరమ్మతులు చేపట్టాలని అధికారులకు పలుమార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని స్థానికులు వాపోతున్నారు. గుంతల్లో నీరు నిలిచి దుర్వాసన వెలువడుతోందని, పాదచారులు ముక్కు మూసుకుని వెళ్లే పరిస్థితి ఏర్పడిందన్నారు. కొన్ని కాలనీలలో రోడ్లు వేసే క్రమంలో ఎక్కడ పడితే అక్కడ తవ్వి పనులను పూర్తి చేయకుండా వదిలేయడంతో వాహనదారులు ఇబ్బందులు చెప్పనలవికాదు.



మాదాపూర్ సాయినగర్‌లో..







నూతన కాలనీలకు మిషన్ భగీరథ మంచినీరు

ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి

పటాన్‌చెరు: అమీన్‌పూర్ మున్సిపల్ పరిధిలో నూతనంగా ఏర్పాటవుతున్న కాలనీలకు సైతం ఇంటింటికి రక్షిత మంచినీరు అందించేందుకు కృషి చేస్తున్నామని ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి తెలిపారు. అమీన్‌పూర్ మున్సిపల్ పరిధిలోని నవ్య కాలనీలో మిషన్ భగీరథ ద్వారా ఏర్పాటు చేసిన ఇంటింటికీ మంచినీటి నల్లా కనెక్షన్లను ఆదివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... గతంలో మంచినీటి కొరత ఉందని నూతన రిజర్వాయర్లు నిర్మిస్తూ ప్రతి ఇంటికి రక్షిత మంచినీరు అందిస్తున్నామని తెలిపారు. త్వరలోనే బంధం కొమ్ము రిజర్వాయర్‌ను ప్రారంభిస్తామని తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ తుమ్మల పాండు రంగారెడ్డి, మున్సిపల్ కమిషనర్ జ్యోతిరెడ్డి, హెచ్ఎండబ్ల్యూఎస్ డీజీఎం చంద్రశేఖర్, మాజీ కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు, సీనియర్ నాయకులు పాల్గొన్నారు.



నల్లా కనెక్షన్లను ప్రారంభించిన ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి

బోనాల ఉత్సవ కమిటీ సమావేశం

ఫిలింనగర్: బోనాలను పురస్కరించుకుని ఆలయాల ఉత్సవ కమిటీ సభ్యుల సమావేశం ఆదివారం ఫిలింనగర్‌లోని గౌతంనగర్ కమ్యూనిటీ హాల్‌లో జరిగింది. ఈ నెల 20వ తేదీ స్వామి వివేకానందనగర్, జైల్‌సింగ్‌నగర్, భగత్‌సింగ్ కాలనీ, పద్మాలయా అంబేడ్కర్‌నగర్, బీజేఆర్‌నగర్, ఎంఆర్‌సీ కాలనీ, బస్తీల్లో బోనాల వేడుకలు నిర్వహించనున్నట్లు ఫిలింనగర్ 18 బస్తీల సంక్షేమ సంఘం అధ్యక్షుడు మామిడి నర్సింగరావు తెలిపారు. అలాగే ఈ నెల 22 నుంచి ఆగస్టు 10వ తేదీ వరకు పలు బస్తీల్లో బోనాల పండుగ జరపడానికి సభ్యులు తీర్మానించారన్నారు. ఆలయాల వద్ద వీధి దీపాల ఏర్పాటు, మంచినీటి సౌకర్యం, శానిటేషన్, పోలీసు బందోబస్తుతో పాటు ఇతర సౌకర్యాలు కల్పించడానికి ఎమ్మెల్యేకు విన్నవిస్తామన్నారు.

ఉపన్యాసం ప్రాముఖ్యతను గుర్తించాలి



చందానగర్: నేటి విద్యా వాతావరణంలో ఉపన్యాసం యొక్క ప్రాముఖ్యతను గుర్తించాలని డాక్టర్ సరోజ్ బజాజ్ అన్నారు. చందానగర్ డివిజన్ పరిధి గంగారంలోని సుమన్ బాలికల జూనియర్ కళాశాల, మహిళా దక్షతా సమితి, బన్సీలాల్ మలానీ నర్సింగ్ కళాశాలల ప్రాంగణంలో ఆదివారం 'మీ మెదడు చదవడం'పై ఉపన్యాస కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ప్రముఖ శాస్త్రవేత్త, విద్యావేత్త డాక్టర్ ఆకాష్ అగర్వాల్ హాజరై మాట్లాడుతూ మనం బోధించే.. నేర్చుకునే విధానంలో విప్లవాత్మక మార్పులు తీసుకురాగల అంశం అని అన్నారు. ఐఐఎస్‌సీ వంటి ప్రముఖ సంస్థలలో సంవత్సరాల తరబడి చేసిన పరిశోధనల ఆధారంగా పారిస్‌లో మేరి క్యూరీ ఫెలోగా మెదడు అంచనా, నమూనా గుర్తింపు, సందర్భోచిత అవగాహన ద్వారా వచనాన్ని ఎలా అర్థం చేసుకుంటుందో వివరించారు. పదాలు తారుమారైనప్పుడు లేదా సంఖ్యా ప్రత్యామ్నాయాలను కలిగి ఉన్నప్పుడు కూడా మనం ఎలా చదవగలమో ప్రదర్శించారు. ప్రస్తుతం ఏక్ స్టెప్ ఫౌండేషన్‌తో అనుబంధం ఉందని, అక్షరాస్యతను మెరుగుపరచడానికి ఆచరణాత్మక సాధనాలుగా మార్చడానికి కృషి చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో మున్నా జగెటియా, సంయుక్త కార్యదర్శి విమల బద్రుకా, సీమా కొఠారి, అనసూయ, సుశీల పాటిల్, నర్సింగ్ కాలేజ్ ప్రిన్సిపల్, అధ్యాపక బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా రేణుకాఎల్లమ్మ బోనాలు



వేడుకల్లో పాల్గొన్న కార్పొరేటర్‌లు వి.సింధు రెడ్డి, బి.పుష్ప తదితరులు



రాయదుర్గం: ఆషాఢమాస బోనాల వేడుకలు ఆదివారం ఇందిరానగర్‌లో ఘనంగా జరిగాయి. ఆలయంలో ఉదయం ప్రత్యేక పూజలు, అభిషేకాలు, అలంకారం చేసి భక్తులకు దర్శనం కల్పించారు. మహిళలు అమ్మవారికి బోనాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. గచ్చిబౌలి కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డి అమ్మవారిని దర్శించుకున్నారు.

బీహెచ్‌ఈఎల్ టౌన్‌షిప్‌లో..

రామచంద్రాపురం(పటాన్‌చెరు): బీహెచ్‌ఈఎల్ టౌన్‌షిప్‌లోని పెద్దమ్మ దేవాలయం వద్ద ఆదివారం బెస్త గంగపుత్ర సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన ఆషాఢ మాసం బోనాల ఉత్సవాల్లో ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి పాల్గొన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్‌లు వి.సింధురెడ్డి, పుష్ప పాల్గొన్నారు.

శేరిలింగంపల్లిలో..

శేరిలింగంపల్లి: ఆషాఢమాస బోనాల వేడుకల్లో భాగంగా శేరిలింగంపల్లి ఆదర్శనగర్ శ్రీ రేణుక ఎల్లమ్మ తల్లి బోనాల వేడుకలను ఆదివారం వైభవంగా నిర్వహించారు. మహిళలు అమ్మవారికి బోనాలను సమర్పించారు. వేడుకల్లో కార్పొరేటర్ రాగం నాగేందర్‌యాదవ్ పాల్గొన్నారు. కార్యక్రమంలో నాయకులు శ్రీనివాస్‌రాజ్ ముదిరాజ్, రవీందర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.





వేడుకల్లో పాల్గొన్న కార్పొరేటర్ నాగేందర్‌యాదవ్

సమస్యల పరిష్కారానికి కృషి

పటాన్‌చెరు టౌన్: పటాన్‌చెరు నియోజకవర్గంలోని దివ్యాంగుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి తెలిపారు. కాగా తమ సమస్యలు పరిష్కరించాలంటూ పలువురు దివ్యాంగులు ఎమ్మెల్యేను క్యాంప్ కార్యాలయంలో కలిశారు. ఇల్లు లేని దివ్యాంగులకు సొంత స్థలం ఉంటే ఇందిరమ్మ పథకం ద్వారా ఐదు లక్షల రూపాయలతో పాటు.. స్థలాలు లేనివారికి డబుల్ ఇల్లు కేటాయించేందుకు ప్రణాళిక రూపొందిస్తున్నామని తెలిపారు.

గోరింటాకు పండగ

అల్విన్‌కాలనీ: ఆషాఢమాస ఉత్సవాల్లో భాగంగా కూకట్‌పల్లి డివిజన్ పాపిరెడ్డినగర్ సమ్మక్క, సారలమ్మ దేవాలయ ప్రాంగణంలో ఆదివారం బీజేపీ మహిళా నాయకురాలు శ్రీలత ఆధ్వర్యంలో గోరింటాకు పండగ నిర్వహించారు.

రేపటి నుంచి ప్రవచనాలు

మోతీనగర్: మోతీనగర్‌లోని శ్రీశృంగేరి శారద శంకరమఠంలో చిన్మయ మిషన్ స్వామి సాక్షి రూపానంద ఆధ్వర్యంలో శ్రీమద్భగవద్గీత -పురుషోత్తమ యోగం 15వ అధ్యాయం ప్రవచనం ఉంటుందని నిర్వాహకులు ఆదివారం తెలిపారు. 15 నుంచి 19వ తేదీ వరకు సాయంత్రం 6.30 నుంచి రాత్రి 8 గంటల వరకు శంకరమఠంలో ప్రవచన కార్యక్రమం ఉంటుందని తెలిపారు.

బొడ్రాయికి పూజలు

మూసాపేట: మూసాపేటలోని బొడ్రాయికి గ్రామ పెద్దలు ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆషాఢ మాసం ఆదివారం మూసాపేట గ్రామంలోని బొడ్రాయికి పూజల అనంతరం బోనాల వేడుకలు మొదలవుతాయని తెలిపారు. కార్యక్రమంలో తూము శైలేష్ కుమార్, సప్పిడి శ్రీనివాస్, గ్రామ పెద్దలు, మహిళలు పాల్గొన్నారు.

అల్విన్ విశ్రాంత కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

అల్విన్‌కాలనీ: అల్విన్ హౌసింగ్ సొసైటీ ఆధ్వర్యంలో అలాట్‌మెంట్ చేసిన ఇళ్ల స్థలాల్లో ఇళ్లు నిర్మించుకోకుండా కూకట్‌పల్లి మండల, జీహెచ్ఎంసీ అధికారులు అడ్డుపడుతున్నారని, సమస్యను పరిష్కరించాలని పలువురు కోరారు. ఈ మేరకు ఆదివారం రాష్ట్ర ప్రభుత్వ సలహాదారుడు వేంనరేందర్ రెడ్డిని ఐఎన్‌టీయూసీ ప్రతినిధుల బృందం కలిసి వినతిపత్రం అందజేశారు. అల్విన్ కంపెనీ కార్మికులకు నాటి ప్రభుత్వ హయాంలో కూకట్‌పల్లి మండల పరిధిలోని 336 సర్వే నంబర్‌లో ప్రభుత్వ భూమిని కేటాయించింది. ఆ స్థలంలో విశ్రాంత కార్మికులు ఇళ్ల నిర్మాణం చేపడుతుంటే అధికారులు కూల్చివేస్తున్నారని తెలిపారు. కార్మికుల వేతనం నుంచి ప్రభుత్వ రేటు ప్రకారం మొత్తాన్ని జమ చేసుకుని ఇళ్ల స్థలాన్ని నాడు కేటాయించారని, నేడు ఆ స్థలాన్ని ప్రభుత్వ భూమిగా పేర్కొంటూ ఎవరో అనామకులు ఫిర్యాదు చేస్తే ఇళ్లు నిర్మించుకోకుండా అడ్డుపడుతున్నారని వాపోయారు. నాటి ఉమ్మడి రంగారెడ్డి జిల్లా కలెక్టర్, ఏడీ సర్వే చేసి స్థలాన్ని కేటాయించినప్పటికీ మండల, జీహెచ్ఎంసీ అధికారులు ఇళ్లు నిర్మించుకోకుండా చర్యలు తీసుకుంటున్నారని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి సమస్యను తీసుకెళ్లి చర్యలు తీసుకోవాలని కోరారు. సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని వేంనరేందర్‌రెడ్డి హామీ ఇచ్చినట్లు సభ్యులు తెలిపారు.

1281 మందికి స్మార్ట్ రేషన్‌కార్డులు

- సర్కిల్‌-7కు మంజూరు
- మొదటిదశ పంపిణీకి సిద్ధమవుతున్న అధికారులు



సనత్‌నగర్: రేషన్‌కార్డుల పంపిణీకి పౌర సరఫరాల శాఖ అధికారులు సిద్ధమయ్యారు. ఇటీవల ప్రజా పాలన, మీ-సేవా కేంద్రాలు, వార్డు కార్యాలయాల్లో అర్హులైన వారి నుంచి దరఖాస్తులు తీసుకోవడంతో పాటు కొత్తగా వ్యక్తుల పేర్లు నమోదు కూడా జరిగింది. పౌర సరఫరాల శాఖ ఖైరతాబాద్ సర్కిల్‌-7 పరిధి కిందికి వచ్చే బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, వెంకటేశ్వరకాలనీ, సోమాజిగూడ, ఖైరతాబాద్, యూసుఫ్‌గూడ, ఎర్రగడ్డ, రహమత్‌నగర్, వెంగళరావునగర్, బోరబండ, అమీర్‌పేట, సనత్‌నగర్ డివిజన్ల పరిధిలో ఉన్న 81 రేషన్ దుకాణాల పరిధిలో రేషన్‌కార్డుల కోసం మొత్తం 19,740 దరఖాస్తులు వచ్చాయి. ఇందులో 360 డిగ్రీల కోణంలో రేషనింగ్ అధికారులు ఇంటింటికీ వెళ్లి సర్వే చేయగా అన్ని అర్హతలు ఉన్నవారు 3,723గా తేలాయి.

- అలాగే పాత కార్డుల్లో పేర్లు తొలగింపు 5,300 దరఖాస్తులు వచ్చాయి.
- పాత కార్డుల్లో కొత్తగా పేర్లు నమోదు కోసం 19,433 దరఖాస్తులు వచ్చాయి.
- కొత్తగా పేర్లు చేర్చిన కార్డులు 1207 ఉన్నాయి.
- ఈ నెల 14వ తేదీ నుంచి కొత్త రేషన్‌కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రారంభించనున్నారు.
- ఈ నేపథ్యంలోనే ఖైరతాబాద్ సర్కిల్‌-7 పరిధిలో మొదటి విడతలో 1281 కార్డులు ప్రింట్ కాగా ప్రత్యేక సమావేశాలు ఏర్పాటు చేసి ఎమ్మెల్యేల చేతుల మీదుగా వీటిని పంపిణీ చేయనున్నారు.
- కార్డులు మంజూరైన ప్రతి ఒక్కరికీ విడతలవారీగా స్మార్ట్ కార్డులను పంపిణీ చేస్తారు.
- సర్కిల్‌-7 పరిధిలో రేషన్‌కార్డుల పంపిణీకి అధికారులు సిద్ధమవుతున్నారు. ఆదివారం రాత్రి సంగారెడ్డిలోని ప్రింటింగ్ కార్యాలయం నుంచి కార్డులను సర్కిల్ కార్యాలయానికి తీసుకువచ్చారు.
- రేషన్‌కార్డుల ప్రక్రియ నిరంతరం కొనసాగుతుందని అధికారులు తెలిపారు.

తాళాలు పగలగొట్టి బంగారు ఆభరణాలు చోరీ

ఫిలింనగర్: గుర్తుతెలియని వ్యక్తులు ఇంట్లోకి ప్రవేశించి అల్మరా తాళాలు పగలగొట్టి బంగారు ఆభరణాలు తస్కరించిన ఘటన ఫిలింనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే.. ఫిలింనగర్‌లోని వినాయకనగర్ బస్తీలో నివసించే పరమేశ్వరి, ఆమె భర్త కురుమయ్య ఇంటికి తాళాలు వేసి విధులకు వెళ్లిపోయారు. రాత్రి తిరిగి వచ్చిన తర్వాత ఇంట్లోకి వెళ్లి చూడగా అల్మరా తలుపులు తెరిచి ఉన్నాయి. లాకర్ పగులగొట్టి బంగారు ఆభరణాలు చోరీ చేసినట్లు పరమేశ్వరి గుర్తించింది. గుర్తుతెలియని వ్యక్తులు కిటికీ అద్దాలు పగులగొట్టి లోనికి ప్రవేశించి లాకర్‌ను పగులగొట్టి బంగారు ఆభరణాలు తస్కరించారని, చర్యలు తీసుకోవాలంటూ బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఫిలింనగర్ క్రైం పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

కాలనీల అభివృద్ధిలో సంక్షేమ సంఘాల పాత్ర కీలకం

శ్రీనగర్‌కాలనీ: కాలనీల అభివృద్ధిలో సంక్షేమ సంఘాల పాత్ర కీలకమని ఏసీపీ డీవీ ప్రదీప్‌కుమార్ రెడ్డి అన్నారు. వెంగళరావునగర్ పార్క్ ఏ టైప్ పార్క్ వద్ద నూతనంగా ఏర్పాటైన వెంగళరావునగర్‌కాలనీ సోషల్ వెల్ఫేర్ అసోసియేషన్ కార్యవర్గ సమావేశానికి ఆదివారం ముఖ్య అతిథిగా హాజరై అసోసియేషన్ పత్రాన్ని ఆవిష్కరించారు.

చాక్లెట్లలో పురుగులు

జూబ్లీహిల్స్ పీఎస్‌లో కేసు నమోదు

బంజారాహిల్స్: తాను కొనుగోలు చేసిన డ్రైఫ్రూట్స్‌లో పురుగులు వచ్చాయని, ఇదే విషయాన్ని సదరు షాపు నిర్వాహకులకు తెలిపితే నిర్లక్ష్యంగా వ్యవహరించారని, సంతృప్తికరమైన సమాధానం ఇవ్వాలని, వారిపై చర్యలు తీసుకోవాలని బాధితుడు జూబ్లీహిల్స్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. వివరాల్లోకి వెళితే.. మాదాపూర్‌లో నివసించే డాక్టర్ పెరూర్ పురేందర్‌రెడ్డి ఈ నెల 12వ తేదీన జూబ్లీహిల్స్ రోడ్డు నంబర్‌-36లోని పోలీస్‌స్టేషన్ పక్కన ఉన్న అజ్సాన్ ఇంటర్నేషనల్ రిటైల్ డేట్స్ అండ్ నట్స్‌లో డ్రై డేటెడ్ బ్లాక్, యూఎస్‌ఏ పిస్తా, యూఎస్‌ఏ వాల్‌నట్, ఆల్మండ్ డేటెడ్ చాక్లెట్స్‌తో పాటు మరికొన్ని డ్రైఫ్రూట్స్ కొనుగోలు చేశారు. ఇంటికి వెళ్లి చూడగా డేటెడ్ చాక్లెట్స్‌లో తెల్లని పురుగులు కనిపించాయి. దీంతో వెంటనే ఆయన సదరు షాపునకు వచ్చి సిబ్బందికి పురుగులు ఉన్న చాక్లెట్ చూపించాడు. షాపు సిబ్బంది ఏమాత్రం స్పందించకపోగా నిర్లక్ష్యంగా వ్యవహరించారు. దీనిపై చర్యలు తీసుకోవాలంటూ బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు అజ్సాన్ ఇంటర్నేషనల్ రిటైల్స్ ఎల్ఎల్‌పీ మేనేజ్‌మెంట్‌పై బీఎన్ఎస్ సెక్షన్ 125, 274, 275, 59 ఫుడ్‌సేఫ్టీ స్టాండర్డ్ యాక్ట్ కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఘనంగా బొడ్రాయి ప్రతిష్ఠాపన



పూజలో పాల్గొన్న ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు తదితరులు

కూకట్‌పల్లి: బాలానగర్ ఫిరోజ్‌గూడలో ఆదివారం యూత్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బొడ్రాయి ప్రతిష్ఠ వేడుక ఆదివారం ఘనంగా జరిగింది. ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, టీపీసీసీ ఉపాధ్యక్షుడు బండి రమేష్ సతీ సమేతంగా హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో లక్ష్మయ్య, మాదిరెడ్డి యుగేందర్ రెడ్డి, బాల నరసింహ, ఆకుల నరేందర్, శేఖర్, గజానంద్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు పాల్గొన్నారు.